క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వర రావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన.. : కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఆన్‌లైన్ పూజకు గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

62వ వార్డులో అపారిశుధ్యం



త్రినాథపురం జంక్షన్‌లో సంచరిస్తున్న పందులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం జంక్షన్ వద్ద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోడ్డు పక్కన చెత్తాచెదారం రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పందులు, దోమల సంచారం అధికమై ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రోడ్డు మార్గం మొత్తం అపారిశుధ్యంగా మారింది. అధికారులు స్పందించి వ్యర్థాలను తరలించాలని, పందులను అరికట్టాలని కోరుతున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ ప్రచారకర్తగా ప్రకాష్

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అంబేద్కర్ కాలనీకి చెందిన ములకలపల్లి ప్రకాష్‌ను లోక్‌సభ ఎన్నికల్లో భువనేశ్వర్, ఒడిశా ప్రాంతాల పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ప్రచారకర్తగా నియమిస్తూ కేంద్ర బీజేపీ ఎన్నికల కమిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన బీజేపీ ఎస్సీ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్ లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బెస్ట్ కొరియోగ్రాఫర్‌గా లుక్స్ రాజశేఖర్



అవార్డుతో లుక్స్ రాజశేఖర్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురానికి చెందిన సినీ కొరియోగ్రాఫర్ లుక్స్ రాజశేఖర్ బెస్ట్ కొరియోగ్రాఫర్‌గా ఎంపికయ్యారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్స్ వైజాగ్(ఈఎంవీ) వారు ఇటీవల నగరంలో ఫొటోగ్రఫీ, కొరియోగ్రఫీ, కేటరింగ్, డెకరేషన్ ఇలా పలు విభాగాల్లో ఉత్తములను ఎంపిక చేసే కార్యక్రమం నిర్వహించారు. డ్యాన్స్ విభాగంలో సుమారు 20 మంది విశాఖ నుంచి పాల్గొనగా.. లుక్స్ రాజశేఖర్ చేసిన నృత్యానికి బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డును ఈఎంఏ వారు అందించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు డ్యాన్సర్లు, అభిమానులు రాజశేఖర్ ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

ఆహ్లాదం.. ఆనందం

- పచ్చటి వాతావరణంలో చిల్డ్రన్ పార్కు
- రూ.50 లక్షలతో ఆధునికీకరణ



కడియం నుంచి తీసుకువచ్చిన మొక్కలతో సుందరంగా ఉన్న చిల్డ్రన్ పార్కు



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



చిల్డ్రన్ పార్కు ముఖద్వారంలో స్వాగతం పలుకుతున్న మొక్కలు

మల్కాపురం: వ్యాయామం చేయాలంటే ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. పార్కుల్లో ప్రత్యేకంగా జిమ్‌లు ఏర్పాటు చేయడంతో వారికి వ్యయప్రయాసలు తగ్గాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసుకుంటూ ఆరోగ్యాన్ని సముపార్జించుకుంటున్నారు.

ఉరుకులు పరుగుల జీవితంలో విశ్రాంతి దొరకడం లేదు.. దీని వల్ల మానసిక ఒత్తిళ్లకు లోనయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఒత్తిళ్లే అనారోగ్యానికి కారణమవుతున్నాయి. దాని నుంచి బయట పడేందుకు అనేక మార్గాలు ఉన్నా.. అందులో వ్యాయామం ప్రథమం.. వైద్యులు, మానసిక నిపుణులు సైతం రోజులో కొంత సమయం **వ్యాయామం చేయడం తప్ప**నిసరి అని సూచించ**డంతో ప్రజలు ఇప్పుడు వ్యా**యామంపై ఆసక్తి పెం**చుకుంటున్నారు. దానికి** తగ్గట్టుగా ప్రభుత్వం **పార్కుల్లో ఖర్చులకు వెనుకా**డకుండా ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. ఈ జిమ్‌ల్లో జనం ఉత్సాహంగా వ్యాయామం చేసుకుంటూ ఉదయం, సాయంత్రం గడుపుతున్నారు.

ఆకర్షణీయంగా..

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలో సుమారు 550 నివాసాలు ఉన్నాయి. వీటిలో సుమారు రెండు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. వీరి కోసం అప్పట్లో సుమారు 75 సెంట్ల భూమిలో పార్కు ఏర్పాటు చేశారు. అయితే దాని ఆలనా పాలనా చూసే నాథుడు లేకపోవడంతో ఆ పార్కు కళావిహీనంగా మారింది. వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ దృష్టికి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి హెచ్‌పీసీఎల్, జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సుమారు రూ. 50 లక్షలతో పార్కును ఆధునికీకరించే విధంగా చర్యలు తీసుకున్నారు.

పార్కులో కల్పించిన వసతులు

- పార్కు చుట్టూ సుమారు 3 వేల వివిధ రకాల మొక్కలు నాటారు
- చిన్నపిల్లలు ఆడుకునేందుకు అధునాతన ఆట పరికరాల ఏర్పాటు
- పెద్దలు వాకింగ్ చేసుకునేందుకు సుమారు 500 అడుగుల పొడవుతో వాకింగ్ ట్రాక్
- పెద్దలు కాలక్షేపం చేయడానికి వీలుగా విశాలమైన బల్లలు, రచ్చబండ
- మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం
- పార్కులోకి పశువులు చొరబడకుండా రక్షణ గేట్లు
- పార్కు పర్యవేక్షణకు ప్రత్యేకమైన టీమ్ ఏర్పాటు.

మాట నెలబెట్టుకున్నాం



జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడ కాలనీ వాసులకు పార్కును ఆధునికీకరిస్తానని హామీ ఇచ్చాను. ఆ మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో పార్కును రూ. 50 లక్షలతో ఆధునికీకరించాం. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం

– పి.వి.సురేష్, వార్డు కార్పొరేటర్

సంతోషంగా ఉంది



కాలనీలో ఇంత సుందరమైన పార్కు నిర్మించడం సంతోషంగా ఉంది. దీనికి సహకరించిన పాలకులకు, జీవీఎంసీ అధికారులకు కృతజ్ఞతలు. నాడు కళావిహీనంగా ఉన్న పార్కు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పిల్లలు, పెద్దలు అంతా ఉత్సాహంగా గడుపుతున్నాం.

కె.బంగారురాజు, వుడాకాలనీ గౌరవ అధ్యక్షుడు

ఆదర్శంగా నిలుస్తుంది



విశాలమైన ప్రదేశంలో పచ్చటి మొక్కల నడుమ సర్వాంగా సుందరంగా చిల్డ్రన్ పార్కును అభివృద్ధి చేశారు. ఈ పార్కు నిర్మాణం కోసం తమ అసోసియేషన్ తరఫున చాలా శ్రమించాం. చివరకు మంచి ఫలితం లభించింది. చాలా ఆనందంగా ఉంది.

– రాజేష్, వుడాకాలనీ కోశాధికారి

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

- మరో వ్యక్తికి గాయాలు



మృతుడు హాలీషా(ఫైల్)

మల్కాపురం: విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఇద్దరు కార్మికులు పశువును ఢీకొట్టి ప్రమాదం బారిన పడ్డారు. ఈ ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా.. 59వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో సమీపాన పాత చెక్ పోస్ట్ ఏరియాలో నివసిస్తున్న ఎం.డి.హాలీషా(45) అనే వ్యక్తి హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో మాజీ సొసైటీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. షిప్‌యార్డ్‌లోని హల్‌షాప్ డిపార్ట్‌మెంట్ వద్ద గార్డెనింగ్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం యథావిధిగా విధులు ముగించుకుని మధ్యాహ్నం 3.40 గంటలకు తన ఇంటికి వెళ్లేందుకు షిప్‌యార్డ్ బయటకు రాగా.. ఆ సమయంలో తనకు పరిచయం ఉన్న మరో కార్మికుడు వెంకటరమణ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. హాలీషా అతడి బండి వెనుక కూర్చోగా.. వారు ముందుకు సాగారు. యారాడకు వెళ్లే మార్గానికి ముందు ఓ పశువు రోడ్డుపైకి అకస్మాతుగా రావడంతో దానిని గుర్తించని వీరు పశువును ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న వెంకటరమణ, వెనుక కూర్చున్న హాలీషాకు గాయాలయ్యాయి. హాలీషాకు తల వెనుక భాగాన తీవ్రంగా గాయం కావడంతో సమీపంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం హాలీషా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై విచారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 ఏళ్ల కల.. నెరవేరిన వేళ



మల్కాపురం పల్లివీధిలో నిర్మిస్తున్న రోడ్డు



రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురం, పల్లివీధి, నగరాలవీధి, గొల్లవీధి, మరిడిమాంబ ఆలయం వెనుక వీధితో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. దీంతో ఆయా వీధులు కళకళలాడుతున్నాయి. 15 ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్డు నేడు కొత్త కళ సంతరించుకున్నాయి. సుమారు రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో పల్లివీధి, నగరాల వీధి, గొల్లవీధి, మరిడిమాంబ ఆలయం వెనుక వీధి ప్రాంతాల్లో సీసీ రోడ్లను గురు, శుక్రవారాల్లో వేశారు. శనివారం కూడా పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయనున్నట్టు వర్క్సు అధికారులు తెలిపారు.

బాబోయ్ కుక్కలు

వీధుల్లో స్వైర విహారం



షిప్‌యార్డ్ కాలనీలోసంచరిస్తున్న వీధి కుక్కల గుంపు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నిత్యం ఒకరిద్దరిని గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తి పోతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్‌కాలనీ, ఏకేసీకాలనీ, రాజీవ్‌కాలనీ, 63వ వార్డులో పరిధిలోని క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ తదితర గ్రామాల్లో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లోనూ గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వృద్ధులను గాయపరుస్తున్నాయి. రేయింబవళ్లు రోడ్ల వెంట సంచరిస్తుడడంతో పనులపై బయటకు వెళ్లాలన్నా, తిరిగి ఇళ్లకు చేరుకోవాలన్నా ప్రజలు భయపడుతున్నారు. కుక్కల దాడితో గాయపడిన బాధితులు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

'ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రా' రిషికకు సత్కారం



కేరళలో జరిగిన పోటీలో విన్నర్‌గా నిలిచిన తన్వి రిషిక

సీతంపేట: నగరానికి చెందిన తన్వి రిషిక ఇటీవల కేరళలో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తన్వి రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గమనించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. తన్వి తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. అనంతరం రిషికను ఘనంగా సత్కరించారు.

చక్కటి జీవనశైలితో అదుపులో రక్తపోటు

మహారాణిపేట : ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం జంక్షన్ మీదుగా ర్యాలీ కొనసాగి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో నెల రోజుల వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత రక్తపోటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక రక్తపోటుతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాల్సి అవసరం ఉందన్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండ సమస్యలు, అకాల మరణాలకు హైపర్ టెన్షన్ ప్రథమ కారణమన్నారు. చాలా మందికి అధిక రక్తపోటు లక్షణాలు లేకపోయినా, చికిత్స చేయకుండా వదిలేస్తే అది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, మందులు తీసుకోవడం ద్వారా రక్తపోటును నివారించవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు వల్ల ఎంతో మంది మరణిస్తున్నారని అన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అధిక రక్తపోటు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు మరణాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డెమో) బి.నాగేశ్వరరావు, డాక్టర్ జగదీష్‌ప్రసాద్, టీబీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం ఎర్నిమాంబ

- కోరిన వరాలిచ్చే కల్పవల్లి
- నేడు అమ్మవారి తొలేళ్ల సంబరం
- ఆదివారం ప్రధాన జాతర



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయ గోపురం

కంచరపాలెం: సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం, ఆదివారం ప్రధాన జాతర జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నసమారాధన, మారువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి వేళ ఈ మార్గంలో వెళ్లేందుకు అంతా భయపడేవారు. తర్వాత ఇక్కడ ప్రజలు నివసించటం మొదలు పెట్టడంతో ఊరు అభివృద్ధి చెందింది. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్లు పూర్వీకులు చెబుతారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. 2007లో సంఘ సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంట్‌కు అప్పగించారు.

మా ఇంటి ఇలవేల్పు



ఎర్నిమాంబను మా ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నాం. అమ్మవార్ని దర్శించుకున్న తర్వాతే ఏ పనైనా చేస్తాం. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అమ్మ కోరిన కోర్కెలు తప్పక తీరుస్తుంది. అమ్మవారి జాతరలో కుటుంబమంతా మొక్కులు చెల్లించుకుంటాం.

– బంటుపల్లి నూకరాజు, గురుస్వామి, పూర్ణామార్కెట్

అమ్మ దీవెనలతో అంతా మంచే



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ పేరుతో కలిసే ఉంటాయి. అమ్మవారిని సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా ఉంటాం. అమ్మ దర్శన భాగ్యం, నిత్య పూజలతో ఎవరికైనా మంచి జరుగుతుంది. నమ్ముకున్న వాళ్లకు కొంగు బంగారంగా అమ్మ కటాక్షిస్తుంది.

– పల్లా పద్మజ, భక్తురాలు, కంచరపాలెం

మౌలిక సదుపాయాలు కల్పించాం

ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు ఆలయ చైర్మన్ ఎల్. రమణ, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శనివారం జరిగే తొలేళ్ల సంబరాలు పూర్ణామార్కెట్ దుర్గమాంబ ఆలయం నుంచి ప్రారంభం అవుతాయి. ఆదివారం జరిగే ప్రధాన జాతరకు ఆలయ పరిసరాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పించాం.

– డీవీఎస్ సురేష్‌బాబా, ఈవో, ఎర్నిమాంబ ఆలయం

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

గోపాలపట్నం: మద్యం మత్తులో మందు సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మాధవధార గాంధీనగర్ మహతి కాలనీలో చిన్ని సంతోష్‌కుమార్, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. అక్కడే ఉంటున్న స్నేహితుడు వాసుతో కలిసి శుక్రవారం స్థానిక బార్‌కు వెళ్లి మద్యం తాగి తిరిగి కాలనీలోకి వచ్చారు. అక్కడ ఓ ఆటోలో సంతోష్‌కుమార్ అన్నయ్య అతడి స్నేహితులతో కలిసి కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో వరసకు బావ అయిన మహేష్ అనే వ్యక్తి సంతోష్‌ను మాట్లాడాలని పిలిచాడు. ఆటో దిగి వెళ్తున్న క్రమంలో మద్యం మత్తులో ఉన్న మహేష్ తనతో తెచ్చిన మందు సీసాతో సంతోష్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో స్నేహితులు సంతోష్‌ను కేజీహెచ్‌కు తరలించారు. మహేష్ భార్య ఎవరితోనో తిరుగుతున్నట్లు ప్రచారం చేస్తున్నాడనే అనుమానంతో సంతోష్‌ను పొడిచేందుకు మహేష్ యత్నించాడు. బాధితుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- కానరాని రక్షణ కంచెలు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- చర్యలు చేపట్టాలని స్థానికుల వినతి



మల్కాపురం–త్రినాథపురం రోడ్డులో రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



నేవీ క్వార్టర్స్‌కు సమీపంలో నేలను తాకినట్టు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులోని మల్కాపురం నుంచి త్రినాథపురానికి వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వాటికి రక్షణ కంచెలు లేకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. రహదారుల పక్కన ఎటువంటి కంచెలు లేకుండా, నేలను తాకేటట్టు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రజలకు, పశువులకు ప్రాణముప్పు ఉందని, పలుమార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల వేసవి, వర్షా కాలాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బహుభాషా గ్రంథావిష్కరణ



డాక్టర్ జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బహు భాషా గ్రంథావిష్కరణ జరిగింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు, ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాల ప్రాముఖ్యత అనే అంశంపై రచించిన 'సమాగమ్' బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించిన సుమారు 50 మంది అధ్యాపకులను డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. సాహితీ రంగంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి సేవలను రచయితలు, సిస్టర్ షైజీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రచయితలు ఎస్. దీప్తి, గౌరీనాయుడు, డి. కోటేశ్వరరావు, అనుపమ, మౌసమి, సుజాత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.